నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 21 ఆగస్టు 2024 | HYDERABAD




హుస్సేన్ సాగర్ పరవళ్లు.. మంగళ వారం కురిసిన భారీ వర్షంతో హుస్సేన్ సాగర్‌లో ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో అధికారులు నీటిని దిగువకు వదిలారు



భారీ వర్షానికి ఆదిత్యనగర్ కాలనీలో రోడ్డు పై నిలిచిన వరదనీరు

# నగరం అతలాకుతలం

తెల్లవారుజాము నుంచే విరుచుకుపడిన వరుణుడు



## స్తంభించిన ట్రాఫిక్

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు, రోడ్లు
- ఐటీ ప్రాంతాల్లో నరక యాతన
- కిలో మీటర్ల మేర నిలిచిన వాహనాలు
- రోడ్లపై కనిపించని రక్షణ సిబ్బంది

సిటీబ్యూరో, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : వాహనదారులు మంగళవారం ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని కుదేలయ్యారు. కిలోమీటర్లు మేర వాహనాలు స్తంభించిపోవడంతో రోడ్లపై బిక్కుబిక్కుమంటూ గడిపారు. 20 నిమిషాల్లో గమ్యం చేరే మార్గాల్లో వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే ఎదురుచూశారు. నగరంలో కురుస్తున్న భారీ వర్షానికి వాహనదారులు అతలాకుతలమయ్యారు. మంగళవారం తెల్లవారు జాము 3 గంటలకు మొదలైన కుంభవృష్టి ఉదయం 7 గంటల వరకు ఏకధాటిగా కురిసింది. అర్ధరాత్రి వరకు విడతల వారీగా నగరాన్ని భారీ వర్షం కుదిపేసింది. గుడి, బడి, ఆసుపత్రి, బస్తీలు, కాలనీలు తేడా లేకుండా వరదనీరు ముంచెత్తింది. నాలా ఏదో, రోడ్డేదో గుర్తు పట్టనంతగా దారులు ఏరులయ్యాయి. రోడ్లన్నీ నదులను తలపించాయి. ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ, హైటెక్ సిటీ, బంజారాహిల్స్, కోఠి, అబిడ్స్, గచ్చిబౌలి, రాయదుర్గం, గండిపేట, ఎల్బీనగర్, సాగర్ రింగ్ రోడ్డు, నాగోలు, బేగంపేట తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అంబర్‌పేట, మలక్‌పేట, డబీర్‌పురా, నల్లగొండ ఎక్స్ రోడ్డు, చాదర్‌ఘాట్, గోల్నాక, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, హైటెక్‌సిటీ, బంజారాహిల్స్, అమీర్‌పేట, మైత్రివనం ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

### కనిపించని ట్రాఫిక్ సిబ్బంది!

ట్రాఫిక్ పోలీసులు రోడ్లపైనే ఉండాలని డీజీపీ ఆదేశించినా ఫలితం లేదు. రోడ్లపై ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు కనిపించడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపైకి ఇష్టానుసారంగా వాహనాలు రావడంతో పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్డు మార్గాల్లో గంటల కొద్దీ వాహనాలు రోడ్లపైనే ఉన్నాయి. వాటర్ లాగింగ్ ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఎక్కడా కనిపించలేదు.

### ఐటీ ప్రాంతాల్లో తీవ్ర నరకం!

భారీ వర్షానికి ఐటీ ఉద్యోగులు చుక్కలు చూశారు. సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో కుండపోత వర్షం కురిసింది. వాహనాలు చాలా నెమ్మదిగా కదలడంతో వాహనదారులు ట్రాఫిక్ నరకం చూశారు. ఓ వైపు వర్షం..మరోవైపు ట్రాఫిక్ సమస్యతో వర్షంలో బిక్కుబిక్కుమంటూ నిశ్చేష్టులుగా మిగిలిపోయారు. మరోవైపు భారీ వర్షం కారణంగా రాంనగర్‌లో ఓ వాహనదారుడు వరదలో వాహనంతో పాటు కొట్టుకుపోయాడు. ఇద్దరు యువకులు ఆ వాహనదారుడిని కాపాడారు. ఈ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. టోలిచౌకిలోని రమాన్ హోటల్ వరద నీటిలో మునిగిపోయింది. పార్సిగుట్ట, బౌద్ధనగర్, గంగపుత్ర, వినోభానగర్ కాలనీలు మోకాళ్ల లోతు నీటిలో దర్శనమిచ్చాయి. పార్సిగుట్టలోని అన్ని కాలనీల్లో ఇంట్లోకి నీరు చేరింది.



పార్సిగుట్టలో..

## అప్రమత్తంగా ఉండాలి

పలు ప్రాంతాల్లో

పర్యటించిన కమిషనర్ ఆమ్రపాలి



సిటీబ్యూరో, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : రహదారులపై నీరు నిలిచిందని, ప్రమాదాలు జరగకుండా క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు, జోనల్ కమిషనర్‌లతో ఆమ్రపాలి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రహదారులపై మరమ్మతులు చేస్తున్న స్థలం వద్ద ప్రమాదాలు సంభవించకుండా..భద్రతా చర్యల్లో భాగంగా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులతో పాటు రాత్రి సమయంలో లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బహుళ అంతస్తుల నిర్మాణాలు, నాలాలు, నీటి వనరుల వద్ద కూడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. మెహిదీపట్నం, హఫీజ్‌నగర్, అత్తాపూర్, గుడి మల్కాపూర్, విజయ్‌నగర్ కాలనీ, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వాటర్ లాగింగ్ పాయింట్లను కమిషనర్ పరిశీలించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లను మేయర్ విజయలక్ష్మి ఆదేశించారు. భారీ వర్షంతో హుస్సేన్‌సాగర్‌కు ఇన్‌ఫ్లో 1850 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో 2100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి తెలిపారు.

### మ్యాన్‌హోల్స్ తెరవొద్దు..

మ్యాన్ హోల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవొద్దని నగర పౌరులకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏవైనా సమస్యలుంటే..జలమండలి కస్టమర్ కేర్ సెంటర్ నం. 155313కి ఫోన్ చేయాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో జలమండలి ఉద్యోగులు, సిబ్బందికి సెలవులు రద్దు చేశారు.

### అంధకారంలో పలు ప్రాంతాలు

భారీ వర్షాలు కురుస్తుండటంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. కొన్ని చోట్ల కరెంట్ వైర్లు తెగిపడ్డాయి. సికింద్రాబాద్‌లోని మైలార్‌గడ్డ, సీతాఫల్‌మండి, ఉప్పల్, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో కుండపోత వర్షం పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు.



మలక్‌పేట రైల్వే బ్రిడ్జి కింద..

### మెట్రో పయనం..!

భారీ వర్షం కారణంగా రోడ్డు పైనే నీరు నిలువడంతో వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. భారీ వర్షానికి తోడు మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో వాహన చోదకులకు సాయంత్రమే చుక్కలు కనిపించాయి. హైటెక్ సిటీ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు రెండు వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. తాడ్‌బన్, బోయిన్‌పల్లి, న్యూబోయిన్‌పల్లి, సుచిత్ర మార్గంలో రాకపోకలు కొనసాగించిన ప్రయాణికులు, వాహనచోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. జిల్లాల నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులు, తొందరగా వెళ్లాలనుకున్న సరుకు వాహనాలు, ఆటోలు, కార్లు ట్రాఫిక్ జాంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రయాణికులు మెట్రోను ఆశ్రయించడంతో స్టేషన్లన్నీ కిక్కిరిసిపోయాయి.



బేగంపేట్ - పంజాగుట్ట రోడ్డులో ట్రాఫిక్ దృశ్యం..

## అకాల వర్షం ప్రాణం తీసింది



విజయ్‌కుమార్ (ఫైల్)

ముషీరాబాద్, ఆగస్టు 20: అకాల వర్షంతో వచ్చిన వరద నీటిలో కొట్టుకుపోయిన ఓ వ్యక్తి మరణించాడు. ఈ ఘటన రాంనగర్‌లో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చి ప్రాంతానికి చెందిన బి.విజయ్ కుమార్(43)కు తల్లిదండ్రులు, భార్యాపిల్లలు లేక పోవడంతో తాగుడుకు బానిసయ్యాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి కూడా ఇంటి ముందున్న అరుగుపై నిద్రపోయాడు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరదను నిద్ర మత్తులో ఉన్న అతడు గమనించలేదు. అతడు నిద్రమత్తులో నుంచి తేరుకునేలోపే వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కొద్ది దూరం నీటిలో కొట్టుపోయిన అతడు కార్ల అడ్డుతగలడంతో ఆగిపోయాడు. అప్పటికే అతడు మృతి చెందాడు. మృతదేహం కార్ల మధ్య చిక్కుకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు మృతదేహాన్ని నీటి నుంచి తీసి.. పోలీసులకు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనా స్థలాన్ని డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహినుద్దీన్, బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ సందర్శించారు.

## గ్రేటర్‌లో జోరు వాన

### సగటున 12 సెంటీమీటర్ల పైనే వర్షపాతం

### లోతట్టు ప్రాంతాలను ముంచెత్తిన వరద

సిటీబ్యూరో: నగరంపై వరుణుడు ఉగ్రరూపం దాల్చాడు. మంగళవారం తెల్లవారు జాము నుంచి రెండు గంటలకు పైగా కురిసిన జోరు వర్షానికి గ్రేటర్ అతలాకుతలమైంది. రహదారులు చెరువులను తలపించాయి. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. కాగా అత్యధికంగా ఖైరతాబాద్‌లో 12.5 సెంటీమీటర్లు, ఉప్పల్‌లో 12.1, రాజేంద్రనగర్‌లో 11.9, సరూర్‌నగర్‌లో 11.5, మారేడ్‌పల్లిలో 11.1, బహదూర్‌పురలో 10.8, గోల్కొండలో 10.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే సాయంత్రం వరుణుడు మళ్లీ ఉగ్రరూపం దాల్చగా.. అత్యధికంగా పటాన్‌చెరులో 4.4 సెంటీమీటర్లు, అమీర్‌పేటలో 3.0, ఖైరతాబాద్‌లో 2.3, బాలానగర్‌లో 2.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అవసరం ఉంటే తప్ప ప్రజలు బయటకు రావద్దని జీహెచ్ఎంసీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

### వర్ష బీభత్సం ఇలా..!!

గ్రేటర్‌లో 6 సెంటీ మీటర్ల నుంచి 12 సెంటీమీటర్ల పైగా వర్షం కురిసింది.163 ప్రాంతాల్లో వరద నీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎల్బీ స్టేడియం పాత సీసీఎస్ వైపున ప్రహరీ కూలింది. ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. 41 చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడగా, 30 చోట్ల డీఆర్‌ఎఫ్ బృందాలు క్లియర్ చేశాయి.

**ఈ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం..**

కుండపోత వర్షానికి బేగంపేట బ్రాహ్మణవాడి మయూరి మార్గ్‌లో వాహనదారులు, హయత్‌నగర్ హైకోర్టు కాలనీలో వరద ముంపుతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆజంపుర ఆర్‌యూబీ వద్ద నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఫర్హత్ నగర్ నాలా వద్ద ఆటో ఇరుక్కుపోయింది. ఎర్రమంజిల్ శాంతి సౌధ అపార్ట్‌మెంట్‌లో చెట్టు విరిగి ప్రహరీ కూలింది.

### పాఠశాలలకు ముందస్తు

## సెలవులు ప్రకటించండి

### విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం



సిటీబ్యూరో : రానున్న 5 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో.. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. భారీ వర్షం కురిసే ప్రాంతాల్లో వాతావరణ శాఖ సూచనలతో పాఠశాలలకు ముందస్తు సెలవులు ప్రకటించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం భారీ వర్షాల ప్రభావం పై రెవెన్యూ, విద్య, వైద్య, అగ్ని, పోలీసు శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో లా ఆఫీసర్ వీరబ్రహ్మాచారి, సీపీఓ డాక్టర్ సురేందర్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## రెండు చోట్ల పిడుగులు

### నిజాంపేట్, పంజాగుట్టలోని అపార్టుమెంట్లపై పడిన పిడుగులు




పంజాగుట్టలో అపార్టుమెంట్‌పై పిడుగు పడటంతో కారుపై పడ్డ రేకులు

దుండిగల్/ఖైరతాబాద్, ఆగస్టు 20 : రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామున నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌పై పిడుగు పడింది. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో పాటు కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నిజాంపేట్‌లోని 26వ డివిజన్ మధురానగర్‌లోని ఉన్నతి అపార్ట్‌మెంట్‌పై మంగళవారం తెల్లవారు జామున పిడుగు పడింది. సుమారు 30 సెకన్ల పాటు భారీ శబ్దం రావడంతో అపార్ట్‌మెంట్ వాసులు ఉలిక్కిపడ్డారు. కొద్దిసేపటి తర్వాత అపార్ట్‌మెంట్ వాసులు పరిశీలించగా విద్యుత్ కేబుళ్లు, లిఫ్ట్ మిషన్ దెబ్బతిన్నట్లు గుర్తించి, ఊపిరి పీల్చుకున్నారు. పలువురు ఫ్లాట్లలో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు టీవీ, ఫ్రిజ్ వంటివి పాడైనట్లు తెలిపారు. పక్కనే ఉన్న బాలాజీ అపార్ట్‌మెంట్‌లో కూడా ఎలక్ట్రానిక్ పరికరాలు పాడయ్యాయి. అదే విధంగా.. మంగళవారం తెల్లవారు జామున పంజాగుట్ట కాలనీలోని సుఖ్ నివాస్ అపార్టుమెంట్ ఆరవ అంతస్తుపై ఉన్న రెయిలింగ్, రేకుల షెడ్డుపై పిడుగు పడింది. దీంతో రేకులు ఎగిరి వచ్చి కారుపై పడటంతో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

# రుణమాఫీ చేస్తారా.. చేయరా?

### కాళ్లు అరిగేలా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు

- రైతులను సముదాయించలేక పోతున్న బ్యాంకు సిబ్బంది
- జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లోనూ ఇదే పరిస్థితి



మేడ్చల్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): సహకార బ్యాంకుల చుట్టూ రుణమాఫీ కోసం రైతులు తిరుగుతూనే ఉన్నారు. సహకార సంఘాలకు వచ్చే రైతులను బ్యాంకు సిబ్బంది సముదాయించలేకపోతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని తొమ్మిది సహకార సంఘాల్లోనూ ఇదే పరిస్థితి. అక్కడికి వస్తున్న రైతులకు అర్హుల జాబితాను మళ్లీ పంపించాం.. అంత వరకే మాకు తెలుసు.. రుణమాఫీ వచ్చేది రానిది మాకు ఎలాంటి సమాచారం లేదని రైతులకు చెబుతూ.. బ్యాంకు సిబ్బంది తిప్పి పంపుతున్నారు. అసలు రుణమాఫీ వస్తుందా? లేదా? ఇలా ఎన్ని రోజులు సహకార సంఘాల చుట్టూ తిరగాలని బ్యాంకు సిబ్బందిని రైతులు ప్రశ్నిస్తున్నారు.

### రుణమాఫీ 3,432 మంది రైతులకేనా..

రుణమాఫీ పొందేందుకు అసలు అర్హులు ఎవరంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయం చేసే రైతులు అర్హులు కారా? రైతులందరికీ రుణమాఫీ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతులను ఎందుకు మోసం చేస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 వేల పైచిలుకు మంది పంట రుణాలు తీసుకుంటే మూడు విడతలలో 3,432 మంది రైతులకు మాత్రమే ప్రభుత్వం రుణమాఫీ చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు.

### అతి తక్కువ రుణమాఫీ అయిన సహకార సంఘాలు

బౌరంపేట్‌లో 632 మంది రైతులకు గాను 14 మందికి, దూలపల్లిలో 615 మంది రైతులకు గాను 51 మందికి రుణమాఫీ అయ్యింది. కాగా, పూడూర్, ఘట్‌కేసర్, అల్వాల్ సహకార సంఘాల్లో రుణమాఫీని పెండింగులోనే ఉంచారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.




### కాళ్లు అరిగేలా తిరుగుతున్నాం



రుణమాఫీ కోసం కాళ్లు అరిగేలా తిరుగుతున్నాం. మాకు రెండెకరాల భూమి ఉంది. సాగు కోసం పంట రుణం రూ. 60 వేలు తీసుకున్నాం. రుణమాఫీ వస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. కానీ, ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదు. అసలు రుణమాఫీ చేస్తారా? లేదా? బ్యాంకు సిబ్బంది చెప్పాలి. రుణమాఫీ వస్తుంది రేపు మాపు అంటూ తిప్పుతున్నారు.

-లలిత, రైతు, కిష్టాపూర్